క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మాక్లూర్: అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన కాశింబీకి శుక్రవారం గుంజ్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గోపు రంజిత్ రూ.20 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. అలాగే గ్రామానికి చెందిన దుమాల గంగుబాయి అనే మహిళ రైతు ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల రైతు బంధు చెక్కును అందజేశారు. సర్పంచ్ గుండారం శేఖర్, బీఆర్ఎస్ నాయకులు అడేందర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ సందర్శన



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాంలో గల లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక అధికారి డాక్టర్ రామానందం శుక్రవారం సందర్శించారు. ఆలయానికి కల్యాణ వేదిక మండపం, నాలుగు ధర్మశాలలు, రాజ గోపురం నిర్మించడానికి రూ.98 లక్షలు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఇటీవల కోరారు. దీంతో టీటీడీ చైర్మన్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి రామానందం, ఆలయాన్ని సందర్శించారు. సర్పంచ్ గడ్డం సరోజ గంగా రెడ్డి, అర్చకులు రవి, మాజీ ఎంపీటీసీ మణిదీపిక పాల్గొన్నారు.

రూ. 50 వేల విరాళం



కమ్మర్పల్లి: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ రథం కోసం నాగాపూర్ వ్యాస్తవ్యులు గుగ్లోత్ సుధాకర్ రూ.50 వేల విరాళం అందజేశారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో వీడీసీ అధ్యక్షుడు బద్దం రాజేష్‌కు ఈ విరాళాన్ని అందజేశారు. వీడీసీ ఉపాధ్యక్షుడు కొడ నర్సయ్య, కోశాధికారి భూమేశ్వర్, కార్యదర్శి అంకిత్ పాల్గొన్నారు.

స్వతహాగా రేషన్ కార్డులు తొలగించుకోవాలి

రెంజల్(బోధన్): ప్రభుత్వ, ప్రవేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన వారు తమ పేర్లను స్వతహాగా రేషన్‌కార్డు నుంచి తొలగించుకోవాలని తహసీల్దార్ రాంచందర్ సూచించారు. 4 సంవత్సరాల నుంచి యువతీ, యువకులు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు సాధించారని, వారితో పాటు ప్రైవేట్ రంగంలో ఇంజనీర్, టీచర్ తదితర ఉద్యోగాలు చేస్తున్న వారు ప్రభుత్వం నిర్దేశించిన సంవత్సర ఆదాయం రూ. 1,50,000 కన్నా ఎక్కువ సంపాదిస్తూ ఆహార భద్రత కార్డు నుంచి తమ పేర్లు తొలగించుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణనలోకి తీసుకుందని వివరించారు. స్వతహాగా తొలగించుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

దాబా హోటళ్లలో తనిఖీలు



నందిపేట్: నందిపేటలోని దాబా హోటళ్లలో శుక్రవారం అటవీశాఖ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో తనిఖీలు చేశారు. హోటళ్లలో వన్యప్రాణుల మాంసం నిషేధించాలని యజమానులను ఆదేశించారు. ఈ మేరకు దాబా హోటళ్ల యజమానులకు నోటీసులు అందజేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని డీఎఫ్‌వో సుధాకర్ హెచ్చరించారు.

పోస్టల్ పథకాలపై అవగాహన ర్యాలీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్ సబ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం బీపీఎంలు, ఏబీపీఎంలతో సురక్ష మహా లాగిన్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాక్సిడెంట్ పాలసీలు, హెల్త్ అండ్ మోటార్ ఇన్సూరెన్స్ పాలసీలు, బీపీఎంలు, ఏబీపీఎమ్‌లు చేయాలని, డైరెక్టరేట్ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు సబ్ పోస్టాఫీస్ ఎస్పీఎం ఆంజనేయులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మన తపాల- మన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుట్టను తొలచి... మొరం తరలించి



గుట్టను చదును చేయడంతో మైదానంగా మారిన ప్రాంతం

- తిమ్మాపూర్, ఉప్లూర్‌ల మధ్య గుట్ట
- వ్యవసాయ భూమిగా మార్చిన వైనం
- రీసర్వేలో పట్టా భూమిగా మార్పులు
- వ్యవసాయానికి అనుగుణంగా మార్పులు అని వాదన
- మొరం తరలించడానికి అనుమతులు పొందని వైనం

మోర్తాడ్(బాల్కొండ) : మోర్తాడ్ మండలం తిమ్మాపూర్, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌ల మధ్య ఉన్న గుట్టను పూర్తిగా తొలగించి వ్యవసాయానికి అనుగుణంగా భూమిని చదును చేశారు. రెవెన్యూ శాఖ అనుమతులు పొందకున్నా మొరంను అక్రమంగా తరలించడం అధికార యంత్రాంగం అడ్డుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమైతున్నాయి. గుట్టగా ఉన్న ప్రాంతం అంతా రీసర్వేలో పట్టా భూమిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. పట్టా భూమిని కొనుగోలు చేసిన వారు వ్యవసాయానికి అనుకూలంగా మార్చడానికి గుట్టను తవ్వేశారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టను తొలగించడంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న వన్యప్రాణులకు ముప్పు ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది. తిమ్మాపూర్, ఉప్లూర్, ఏర్గట్లలోని వ్యవసాయ క్షేత్రాలు, అటవీ భూముల్లో వందలాది సంఖ్యలో నెమళ్లు, జింకలు, అడవి పందులు, ఇతర వన్యప్రాణులు ఉన్నాయి. గుట్టను తొలగించడానికి చెట్లను సైతం తొలగించడంతో వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. పట్టాభూమిలో మొరం తరలించాలన్నా వాల్టా చట్టం ప్రకారం అనుమతులు పొందాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను కూల్చి, మొరం తరలిస్తుండటం అధికారులు మౌనం వహించడం గమనార్హం. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి గుట్టను తవ్వేసిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వ్యవసాయం కోసం చదును చేస్తున్న ప్రొక్లెయినర్



మొరం తరలిస్తున్న ట్రాక్టర్

పింఛన్‌లో సగం కూడా ఇవ్వడం లేదు

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

కోటగిరి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మెచ్చి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు కూడా బీఆర్ఎస్ పార్టీ తమ రాష్ట్రాల్లో పోటీ చేయాలని సీఎం కేసీఆర్‌పై ఒత్తిడి తెస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వల్లేపల్లి సునీత అధ్యక్షతన జరిగిన సభలో స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లోని 84 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో పేదలకు అందించే సంక్షేమ పథకాలు వారి అవసరాలకు అక్కరకు వచ్చేవి కావని, కేవలం నామమాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణలో ఇచ్చే పింఛన్‌లో సగం కూడా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. ఒక్క బాన్సువాడ నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు సుమారు 16 వేల మందికి పెళ్లి సాయం అందించినట్లు తెలిపారు. ఈ సభలో వైస్ ప్రెసిడెంట్ మర్కెలి గంగాధర్ పటేల్, జెడ్పీటీసీ శంకర్, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, జెడ్పీ కో- ఆప్షన్ మెంబర్ కల్లూర్ సిరాజ్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎజాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల పరిశీలన



దూపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర పరిశీలకుడు కన్నప్ప



బ్రాహ్మణపల్లి జీపీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకుడు గంగప్ప

రెంజల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శుక్రవారం ఎస్ఎల్ఎం కమిటీ సభ్యుడు కన్నప్ప క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దూపల్లి, కూనేపల్లి, కందకుర్తి గ్రామాల్లో పర్యటించారు. ఉపాధిహామీ పథకం ద్వారా చెరువుల్లో పూడికతీత పనులను పరిశీలించేందుకు వెళ్లగా దూపల్లి, కూనేపల్లి గ్రామాల్లోని చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో చెరువుకట్టలు, కాల్వలు, పల్లెప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులను ప్రత్యేకంగా స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై చర్చించారు. సర్పంచ్‌లు సాయరెడ్డి, విజయ, ఎంపీడీవో శంకర్, డీఆర్‌డీవో కార్యాలయ ప్రతినిధి విజయ్ పాల్గొన్నారు.

ఎడపల్లి పరిధిలో..

ఎడపల్లి(బోధన్): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు, పని తీరుపై కేంద్ర ప్రభుత్వ పరిశీలకుడు గంగప్ప శుక్రవారం బ్రాహ్మణపల్లి గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో సుభాష్‌చంద్రబోస్, ఏపీవో గంగారాం, ఏపీఎం సాయిలు, సర్పంచ్ లక్ష్మీరాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల పోరాటానికి ఎంఐఎం మద్దతు



శిబిరంలో కూర్చున్న ఎంఐఎం కౌన్సిలర్లు

బోధన్ : ప్రత్యేక జిల్లా ప్రకటన కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఎంఐఎం కౌన్సిలర్లు, నాయకులు మద్దతు తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 33వ రోజుకు చేరాయి. దీక్షలో ఎంఐఎం కౌన్సిలర్లు, నాయకులు కూర్చున్నారు. వీరిలో మున్సిపల్ ఎంఐఎం ఫ్లోర్ లీడర్, మాజీ వైస్ చైర్మన్ హబీబ్ ఖాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ముషీర్‌బాబా, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఖానాపూర్‌లో స్వర్గ రథం ఏర్పాటుకు కేటాయించిన నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. స్వర్గ రథం ఏర్పాటుకు నిధులను కేటాయించడంలో అవకతవకలు జరిగాయని ఈ సందర్భంగా నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ ఆర్మూర్ మండల అధ్యక్షుడు రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



మాక్లూర్ : తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభల వాల్ పోస్టర్లను ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా ఉపాధ్యక్షురాలు లత ఆవిష్కరించారు. శుక్రవారం మాణిక్‌భండార్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహాసభలు జరుగనున్నట్లు తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్న అంశాలపై మూడో మహాసభలో ప్రధాన చర్చ ఉంటుందన్నారు. జిల్లా నుంచి సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపు నిచ్చారు. మహిళా నాయకులు సుబ్బలక్ష్మి, లావణ్య, సుకన్య, సరోజన, సవిత పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ అంతరాయం

మాక్లూర్: నెలవారి మరమ్మతులలో భాగంగా మండలంలో 4 గంటల పాటు విద్యుత్ సరాఫరా ఉండదని సహాయక డివిజనల్ అధికారి అశోక్ శనివారం తెలిపారు. మండలంలోని చిక్లీ, గొట్టిముక్కల, బొంకన్‌పల్లి, మాక్లూర్, డీకంపల్లి తదితర సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లోను శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరాఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రతి మూడవ శనివారం చేపట్టే మరమ్మతుల్లో భాగంగా ఏర్పడే అంతరాయమేనని వెల్లడించారు.

నేడు, రేపు అల్లమా ప్రభు ఆలయ ఉత్సవాలు

రుద్రూర్ : చందూర్ శివారులోని అల్లమా ప్రభు ఆలయ ఉత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. ఆలయ పరిసరాలు శుభ్రం చేసి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం అభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నదానం, అర్ధరాత్రి అగ్ని గుండం ఏర్పాటు చేస్తారు. ఆదివారం జాతర కొనసాగుతుంది. సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా ఆలయ కమిటీ బృందం కోరింది.

కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలు



ఆర్మూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న చిత్ర మిశ్రా



రెంజల్‌లో పరిశీలిస్తున్న అధికారి రాములు

కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. శుక్రవారం కూడా ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి రోజూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని, ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని 33వ వా ర్డులో మున్నూర్‌కాపు సంఘంలో ఏర్పాటు చే సిన కంటివెలుగు కేంద్రాన్ని జిల్లా అదనపు క లెక్టర్ చిత్ర మిశ్రా, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతలు పరిశీలించారు. అలాగే బోధన్ రైతు వేదికలో కంటి వెలుగు శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, రెంజల్‌లో మండల ప్రత్యేకాధికారి రాములు పరిశీలించారు. కోటగిరి మండల కేంద్రంలో ఐకేపీ, ఐసీడీఎస్, జీపీ సిబ్బంది ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

–బోధన్ టౌన్/కోటగిరి/రెంజల్/ఆర్మూర్ టౌన్/రుద్రూర్



బోధన్‌లో పరీక్షలు చేయించుకుంటున్న ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్



కోటగిరి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఐకేపీ, ఐసీడీఎస్, జీపీ సిబ్బంది

పారిశుద్ధ్య లోపంపై తనిఖీలు



జానకంపేటలో కాలువలను పరిశీలిస్తున్న ఎంపీవో సుభాష్ చంద్రబోస్

ఎడపల్లి(బోధన్): జానకంపేటలో మురికి కాలువలను గ్రామ పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో చెత్త చెదారం పేరుకుపోయి దోమలు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ గ్రామంలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం పంచాయతీ అధికారి(ఎంపీవో) సుభాష్ చంద్రబోస్ పర్యటించి తనిఖీ చేశారు. గ్రామంలో మురికి కాలువలు, పందుల బెడద వంటి అంశాలపై గ్రామస్తులు ఎంపీవోకి ఫిర్యాదు చేశారు. ఎంపీవో మాట్లాడుతూ..గ్రామంలో పందులు తిరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లేని పక్షంలో పందుల పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో అక్రమ కట్టడాలు, పారిశుద్ధ్యంపై వచ్చిన ఫిర్యాదులపై నివేదికను తయారుచేసి జిల్లా పంచాయతీ అధికారికి పంపుతామన్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఆధ్యాత్మికం..

జాతరకు ముస్తాబైన ‘చిలుకల చిన్నమ్మ’



బాల్కొండ: శ్రీరాంపూర్‌లోని చిలుకల చిన్నమ్మ ఆలయం శనివారం నిర్వహించే జాతరకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం మాఘ మాసంలో అమావాస్య రోజున జాతరను ఘనంగా నిర్వహిస్తారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన శ్రీరాంపూర్‌లో వెలసిన చిలుకల చిన్నమ్మ అంటే భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ఎంతో నమ్మకం. జాతరకు ప్రాజెక్టులో ముంపునకు గురైన అన్ని గ్రామాల నుంచి భక్తులు తరలి వస్తారు. గోదావరి నుంచి అమ్మవారికి ఎదుర్కోళ్లు నిర్వహిస్తారు. మొక్కులను తీర్చుకుంటారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి



ఎడపల్లి(బోధన్): శనివారం అమావాస్య పురస్కరించుకుని జానకంపేట్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కోనేరు వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ఈవో వేణు తెలిపారు. శుక్రవారం ఆలయ సిబ్బంది, ఆలయ చైర్మన్ సాయిలు, రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఆలయ ధర్మకర్త మండలితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు వసతులతో పాటు, వైద్య సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే కోనేరులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను తెప్పించినట్లు వెల్లడించారు. బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పుష్కరక్షేత్రంలో భక్తుల సందడి



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. పర్వదినాలతో పాటు ప్రతీ ఆది, శుక్రవారాలు భక్తులు గోదావరిలో పవిత్ర స్నానాలకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం మాస శివరాత్రి కావడంతో భక్తులు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. నదిలో తెప్పలు వదిలారు. నదిలోని పురాతన శివాలయం నీట మునిగి ఉండటంతో ఒడ్డున గల పుష్కరరాజ్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందకుర్తి పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు

రెంజల్: కందకుర్తిలోని కేశవ శిశు విద్యా మందిర్ విద్యార్థులకు శుక్రవారం నిజామాబాద్‌కు చెందిన శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పది వేల విలువ చేసే ఆట వస్తువులు అందజేశారు. విద్యార్థులందరు విద్యతోపాటు ఆటలు ఆడినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిరోజు విద్యార్థులు ఆటలు ఆడాలని, అందరూ సేవా గుణాన్ని చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు తొడుపునూరి రాంమోహన్, తంగళ్లపల్లి శ్రీనివాస్, పాపిని సతీష్, తొడుపునూరి శ్రీనివాస్, అర్వపల్లి బాలశేఖర్, ప్రధాన ఉపాధ్యాయులు సతీష్ పాల్గొన్నారు.

